క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న మాజీ మేయర్‌ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన జెట్టి భిక్షపతి అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స కోసం ప్రయివేట్‌ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.60 వేల చెక్కును శుక్రవారం మాజీ మేయర్‌ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి బాధితునికి అందచేశారు.

‘ఒలింపియాడ్‌’లో వక్తృత్వ పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం

మీర్‌పేట: మీర్‌పేటలోని నాగార్జున ఒలింపియాడ్‌ పాఠశాలలో శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మాట్లాడటం మనిషికి ఒక వరమని, మాటలను అందంగా పద్ధతి ప్రకారం అనుకున్న అంశం మీద మాట్లాడితే మంచి ఉపన్యాసం అవుతుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన అవసరమని తెలిపారు. పోటీల్లో హయత్‌నగర్‌, జల్‌పల్లి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారని ప్రిన్సిపాల్‌ బాబ్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, స్టేట్‌ ఇంచార్జి ముంతాజ్‌, హెడ్‌ శివరంజని, మహేశ్వరి, మీనా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ మహిళా అధ్యక్షురాలిగా కవితారెడ్డి



కేఎల్‌ఆర్‌ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న కవితారెడ్డి తదితరులు

కందుకూరు: కాంగ్రెస్‌ మండల మహిళా అధ్యక్షురాలిగా ఆకులమైలారానికి చెందిన సత్తు కవితారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కవితారెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు కేఎల్‌ఆర్‌తో పాటు జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి భీంభరత్‌, నియోజకవర్గం అధ్యక్షురాలు సమంతప్రకాశ్‌, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మాజీ పార్టీ అధ్యక్షుడు ఎస్‌.కృష్ణనాయక్‌, అందుగుల సత్యనారాయణ, కప్పాటి పాండురంగారెడ్డి తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఏకుల మహేందర్‌, ఉండేలా బాబురావు, ఎస్‌.గణేష్‌నాయక్‌, ఈ.శ్రీకాంత్‌రెడ్డి, డి.కృష్ణ, ప్రభాకర్‌ తదితరులు పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ లైన్‌ క్లియర్‌పై హర్షం

బడంగ్‌పేట్‌: పెండింగ్‌లోని లేఅవుట్‌ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు, 24వ డివిజన్‌ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ..ఎన్నో ఏళ్లుగా అక్రమ లే అవుట్ల పేరుతో ప్లాట్లు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీంతో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో భూయజమానులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నేడు ఎల్‌ఆర్‌ఎస్‌కు లైన్‌ క్లియర్‌ చేస్తూ జీవో విడుదల చేయటం సంతోషమన్నారు. ఈ విషయంలో గత ఎన్నికల్లో ప్రజల కిచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ క్రమబద్ధీకరిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నిర్ణయం తీసుకోవడంతో ధన్యవాదాలు తెలిపారు. ప్లాట్ల క్రయ విక్రయదారులను గతంలో బీఆర్‌ఎస్‌ పట్టించుకోలేదన్నారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లోని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

కేశంపేట: నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్‌తో ప్రోత్సహిస్తోంది. ఇనేషనల్‌ మీన్స్‌ కమ్‌ మెరిట్‌ పథకం(ఎన్‌ఎంఎంఎస్‌) ద్వారా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించింది.

ఇంకా 28 రోజులే..!



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పది పరీక్షలకు సన్నద్ధం

- ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ఫలితాలే లక్ష్యం
- నిత్యం రెండుగంటల పాటు ప్రత్యేక తరగతులు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు కృషి

మహేశ్వరం: విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి తొలిమెట్టు. వారి బంగారు భవిష్యత్‌కు దశ, దిశ నిర్దేశం చేసేది ఇక్కడే. పదో తరగతిలో ప్రతిభ కనబరిచితే బంగారు బాట పడుతుంది. కానీ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అంతా సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రయివేట్‌ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ హాస్టల్స్‌లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలంలో ఇలా...

మహేశ్వరం మండలంలోని మొత్తం 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 1,024 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలు, మోడల్‌ స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

భవిష్యత్‌కు పునాది

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది పదోతరగతే. గతంలో పది పరీక్షలకు 11 పేపర్లు ఉండగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం 7 పేపర్లకు కుదించింది. ఒక్కో పేపర్‌ పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. ఇందులో బయాలజీ, ఫిజిక్స్‌, కెమిస్ట్రీ మాత్రమే గంటన్నర చొప్పున ఉంటుంది. ఆయా సబ్జెక్టులకు 3 గంటల సమయం ఉంటుంది.

ప్రత్యేక తరగతులు..

పదోతరగతి విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల పాటు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించి మధ్యాహ్నం 3 గంటలకు ఆ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. అదే విధంగా సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 వరకు రెండు గంటల పాటు ప్రత్యేక స్టడీ అవర్స్‌ నిర్వహించి ఆయా సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చదువుల్లో చురుకుగా ఉన్న వారు, వెనుకబడిన వారిని గుర్తించి ఇంకా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించాలి

ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగించే విషయాలను చెబుతూ ఉత్తేజపరుస్తున్నారు. ఈ ఏడాది పదికి పది మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ముందుగానే చెప్పి ఆసక్తి కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారికి తగిన సలహాలు, సూచనలతో తర్ఫీదు ఇస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యాంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహించి భయాన్ని పోగొడుతున్నారు.

ప్రతీరోజు స్లిప్‌ టెస్టులు



ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు స్లిప్‌ టెస్టులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

– నందిని, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల, మహేశ్వరం

సందేహాలు నివృత్తి..



పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నా. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను. పాఠాల్లోని సందేహాలను స్టడీ అవర్స్‌లో నివృత్తిచేసుకుంటున్నాం. కష్టపడి చదివి పది జీపీఏ సాధిస్తా. ఉపాధ్యాయులు పరీక్షలపై భయాన్ని పోగొట్టి ధైర్యం చెబుతున్నారు. పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

– దివ్య, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ..



పది పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ప్రతీరోజు సబ్జెక్టుల వారీగా టెస్టులు నిర్వహించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4:15 నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థినిపై శ్రద్ధ తీసుకుంటున్నాం.

– శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు, మహేశ్వరం

మెరుగైన ఫలితాలే లక్ష్యం



మండలంలోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఈ సంవత్సరం సుమారు 1,024 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నారు. మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గతంలో కంటే ఈ సారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

– కస్నా నాయక్‌, మండల విద్యాధికారి

యథేచ్ఛగా బెల్టుషాప్‌ల నిర్వహణ

- పట్టించుకోని పోలీసులు

పహాడీషరీఫ్‌: పహాడీషరీఫ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బెల్టుషాప్‌లకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. మందుబాబులు 24 గంటల పాటు మత్తులోనే తూలుతున్నారు. శ్రీరాం కాలనీ, జల్‌పల్లి, మామిడిపల్లి, బాలాజీ కాలనీ, రంగ నాయకుల కాలనీ, దేవేందర్‌ కాలనీ, పహాడీ షరీఫ్‌ గ్రామం, సర్దార్‌నగర్‌, తుక్కుగూడ, మంఖాల్‌, హర్షగూడలలో బెల్టుషాప్‌లను నడుపుతున్నారు. బతుకుదెరువు కోసం వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికులతో పాటు స్థానిక ప్రజలు విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో ఎంచక్కా లేచింది మొదలు అదే పనిలో ఉంటున్నారు. వెరసి ఆరోగ్యాలు పాడు చేసుకుంటుడడంతో పాటు తాగిన మైకంలో నేరాలకు పాల్పడుతున్నారు. బెల్టు షాప్‌లు ఇంత దర్జాగా నడుపుతున్నా ఎక్సైజ్‌ అధికారులు, స్థానిక పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పలు ఆరోపణలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌

పహాడీషరీఫ్‌: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యుడు అంబోజీ శ్రీనివాస్‌ పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి గడిచిన ఆరేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వివరాలు ఇవ్వాలని శుక్రవారం ఆయన మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబోజీ శ్రీనివాస్‌ మాట్లాడుతూ....2018 నుంచి 2025, జనవరి 31వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన అమృత్‌ మిషన్‌, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, స్వచ్ఛభారత్‌, స్మార్ట్‌ సిటీ మిషన్స్‌ ద్వారా విడుదలైన నిధులు, పూర్తయిన పనుల వివరాలు ఇవ్వాలని కోరారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపల్‌ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లా వ్యాప్తంగా అమలయ్యే విధంగా దిశ కమిటీ చైర్మన్‌, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ క్రమంలోనే మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని, అందులో భాగంగానే జల్‌పల్లి సమాచారాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ ఎనగండ్ల శ్రీధర్‌ గౌడ్‌, నాయకులు గొరిగె మల్లేష్‌, సంతోష్‌, బాల శివుడు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్లో ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టిన పనులు, నిధుల వివరాలను సమర్పించాలని జిల్లా దిశా కమిటీ సభ్యులు అంబోజి శ్రీనివాస్‌ శుక్రవారం కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నిధులతో రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో అభివృద్ధి జరుగుతోందని, పథకాలు జిల్లా వ్యాప్తంగా అమలయ్యేలా కమిటీ చైర్మన్‌, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట బీజేపీ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డిలు ఉన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఘట్టుపల్లి బీఆర్‌ఎస్‌ నాయకులు, గ్రామస్తులు

26న ఘట్టుపల్లిలో మహా శివరాత్రి

- ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దీనికి హాజరు కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డికి శుక్రవారం గ్రామస్తులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఘట్టుపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో 26 నుంచి 28 వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో గ్రామస్తులు చర్చించారు. మహా శివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు గ్రామస్తులకు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వీరాంజనేయ స్వామి ట్రస్టీ సభ్యులు, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్ర శంకరయ్య, మాజీ ఉప సర్పంచ్‌ మేకల శ్రీనివాస్‌ యాదవ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు చంద్రశేఖర్‌ యాదవ్‌, మాజీ పీఏసీఎస్‌ డైరెక్టర్‌ ఎండి. సాదత్‌, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌, వినోద్‌, బాలు నాయక్‌,శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ అంతరాయం

హుడాకాంప్లెక్స్‌: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గణేష్‌నగర్‌, కుంట్లూర్‌ లక్ష్మీ గణపతి, తట్టిఅన్నారం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1గంట వరకు, 11కేవీ హుడా సాయినగర్‌ ఫీడర్ల పరిధిలోని కాలనీలల్లో మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు రామకృష్ణ తెలిపారు. ఈ విషయంలో విద్యుత్‌ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- బీసీ కమిషన్‌ రాష్ట్ర సభ్యుడు జయప్రకాష్‌

ఇబ్రహీంపట్నం రూరల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సామాజిక న్యాయం దక్కుతుందని బీసీ కమిషన్‌ రాష్ట్ర సభ్యుడు రాపోలు జయప్రకాష్‌ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మాజీ సర్పంచ్‌ ఈసీ శేఖర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కులగణన రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌ మాట్లాడుతూ.. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడానికి కులగణన చేసి మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే ఎవరూ చేయని సాహసోపేతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నాయకుడన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించడానికి కృషి చేస్తున్నరన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ పేద, బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తుందన్నారు. కులగణనలో ఇప్పటికీ పేర్లు నమోదు చేసుకొని వారికి ఈ నెల 28వ తేదీ వరకు చివరి అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్‌ బాలకృష్ణ, నాయకులు రజినీకాంత్‌గౌడ్‌, కృష్ణ, దేవగౌడ్‌, దర్శన్‌, సాయిబాబాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకులాల ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నామని స్థానిక గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నూర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష ఉందన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్‌రూరల్‌: గురుకుల పాఠశాల ప్రవేశాల కోసం ఆదివారం రాత పరీక్ష నిర్వహిస్తున్నామని చేవెళ్ల సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌ మాలతీ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల ఎస్‌వీ ఇంజనీరింగ్‌ కళాశాలలో పరీక్ష కొనసాగుతుందని చెప్పారు.

మాతృభాషను ఆదరిద్దాం



బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ మనోహర్‌

షాద్‌నగర్‌రూరల్‌: అమ్మలాంటి మాతృభాషను ఆదరించి పరభాష వ్యామోహన్ని విడనాడుదామని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా అన్నారు. శుక్రవారం కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ... అమ్మ ఉగ్గు పాలతో నేర్చుకున్న మాతృభాష ఎంతో గొప్పదని అన్నారు. కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ సృజన, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొగిలిగిద్దలో..

ఫరూఖ్‌నగర్‌ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటహరికృష్ణ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియచేస్తూ విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ మనోహర్‌ హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఎలికట్టలో..

ఎలికట్ట ప్రాథ మికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలలో నిర్వహించిన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్‌, కృష్ణమ్మ, అరుణ, రేణు, మాలతి, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

నేటి నుంచి రామేశ్వరంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మహాశివరాత్రి వరకు కొనసాగనున్న జాతర



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వరస్వామి ఆలయం



కోనేరులో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం

షాద్‌నగర్‌రూరల్‌: ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రామేశ్వరంలో ఉన్న ఉత్తర రామలింగేశ్వరస్వామి ఆల యం మహాశివరాత్రికి ముస్తాబైంది. శనివారం నుంచి దేవాలయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందుకు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయానికి ఎలా వెళ్లాలి

ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. వీటికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌, హైదరాబాద్‌ జిల్లాలతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఉత్తర రామలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రం షాద్‌నగర్‌ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్‌ నుంచి బెంగళూరు వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వే టోల్‌ప్లాజా సమీపంలోని రాయికల్‌ వద్ద ఆలయ ముఖద్వారం ఉంది. ఇక్కడి నుంచి 3 కిలోమీటర్లు ప్రయాణిస్తే రామలింగేశ్వరస్వా మి దేవాలయం వస్తుంది. రామేశ్వరం బ్రహ్మోత్సవాల ఏటా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుతుంది.

కార్యక్రమాల వివరాలు

మహా శివరాత్రి సందర్భంగా ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమై మార్చి 1 వరకు కొనసాగనున్నాయి. మొదటిరోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్రహోమం, అంకురార్పణం, ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పర్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, నందిసేవ, రాత్రి అగ్నిగుండాలు, మంగళవారం ద్వాదశి రుద్రాభిషేకం, బుధవారం మహాశివరాత్రి, గురువారం చతుర్దశి రుద్రహోమం, పూర్ణాహుతి, శుక్రవారం రాత్రి 9గంటలకు పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం, శనివారం శివ తీర్థము తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆలయ నేపథ్యమిదే

రావణాసురుడిని వధించిన తరువాత శ్రీరాముడు అయోధ్యకు బయలు దేరాడని, సీతాదేవిని అరణ్య మార్గం నుంచి తీసుకువెళ్తూ కోటి లింగాలను ప్రతిష్ఠించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఫరూఖ్‌నగర్‌ మండలం రామేశ్వరంలో శ్రీరాముడు శివ పూజ కోసం లింగాన్ని ప్రతిష్ఠించాడు. ఆ శివలింగాన్నే నేటికి భక్తులు పూజిస్తున్నారు. సాక్షాత్తు శ్రీరాముడే శివ లింగాన్ని ప్రతిష్ఠించినందుకు రామేశ్వరమనే పేరు వచ్చింది. ఇక్కడి శివలింగం ఎంతో మహిమగలదని భక్తుల నమ్మకం. గర్భగుడిలోని శివ లింగం ఏటా పెరుగుతూ భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ప్రతి పౌర్ణమికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు.



రాయికల్‌ వద్ద నిర్మించిన ఆలయ ముఖద్వారం

అన్ని సౌకర్యాలు కల్పించాం



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చర్యలు చేపట్టాం. ప్రత్యేకంగా శాశ్వత క్యూ లైన్లు ఏర్పాటు చేశాం. టెంట్లు, మంచినీటి వసతి, వైద్య సదుపాయాలను సిద్ధం చేశాం. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులతో పటిష్ట నిఘా నిర్వహిస్తున్నాం.

– శివకుమార్‌, ఆలయ ఈఓ, రామేశ్వరం